

# రాంబాబూ - రిలాక్సింగ్ ఛెయిరూ !!

## - వర్చస్వి ఎల్. పుచ్చా

మళ్ళీ రాంబాబూ - రిలాక్సింగ్ ఛెయిరూ - రెడీ !! మెట్ల క్రిందున్న తన రూంలోంచి సరాసరి నాల్గో అంతస్తు టెర్రేస్ మీద కెక్కి రిలాక్సింగ్ ఛెయిర్‌లో కూలబడి కూల్‌గా లోకం చుట్టి రావడం రాంబాబు ఆనవాయితీ ! అలా కాంప్లెక్స్ పైకెళ్ళి ' కాంప్లెక్స్' ధోరణిలో ఆలోచించడం కూడా ఆనవాయితీయే !! పాత వాసన కొట్టే ఆ ఛెయిర్‌ని రాంబాబు ఎప్పుడూ తన ' ఆస్తి'గా భావించలేదు. తన ఈ నిరుద్యోగ పర్వంలో సర్వం తానయి సానుభూతి చూపెట్టి, ఆశ్రయమిచ్చే దాన్ని ఒక 'జిగ్రీ'లా చూస్కోడం మాత్రమే తెలుసు. సగం పెరిగిన గడ్డాన్ని ముద్దాడుకుంటూ తన ఆర్మ్ ఛెయిర్‌లో ఆసీనుడయ్యాడు. ' అచ్చం అమ్మ ఒళ్ళో కూర్చునట్లుంది' అనుకున్నాడు రాంబాబు. ఔను ! అమ్మ !! ఏం చేస్తుంటుందిప్పుడు ఆ పల్లెలో ? ప్రొద్దుట మిద్దె మీద పెట్టగా ఎండిన ఒడియాలు సర్ది ఇంట్లో పెడుతూంటుంది. నాన్నో... ? తనలాగే మిద్దె మీద కూర్చుని మూడు నెల్లుగా స్కూలు వాళ్ళివ్వని జీతాలు రావడానికింకెంత టైం పడ్తుందో అని ఆలోచిస్తుంటాడు. తను మాత్రం ఈ రద్దీ ప్రాంతంలో జీవితానికీ - జీతానికీ మధ్య బాట వేసే బిజీ ఆటలోనో, 'బిజీ' పేరుతో రాజిల్లే సిటీ 'గజిబిజి'లోనో ఉన్నాడు. అఫ్టాల్ తనేయేంటి ? ఆకడమిక్స్ అయిపోయిం.తర్వాత నిరుద్యోగ పర్వంలో అనేకానేక రాంబాబు బుర్రలన్నీ 'గజిబిజే'! పాలిష్‌డ్‌గా సింపుల్‌గా 'ఆబ్ స్ట్రాక్ట్' అంటారు గాబోలు ! గజిబిజి ఆల్‌జీబ్రాని 'ఆబ్‌స్ట్రాక్ట్ ఆల్‌జీబ్రా' అని అందుకే అన్నారేమో ... ? ఆల్ - జీబ్రా అంటే ? ఆల్ జీబ్రాస్ వంటి మీదుంటే గజిబిజి చారలు అలాంటివేనేమో ... ?

ఆలోచనల్ని రోడ్డు ప్రక్క మీద నుంచి లాగి పక్కా రోడ్డు మీద పెట్టడానికన్నట్లు తన సులోచనాల్ని ఒక సారి సవరించి ముక్కున పడేస్కున్నాడు సుతారంగా రాంబాబు. లాభం లేదు... ! మైండ్లో ప్రొద్దుటే ఇంటర్వ్యూ కంటిన్యూ అయింది.

ఆ రోజు......

' మే ఐ కమిన్ ? అనడిగినా సమాధానం రాకపోయేసరికి అలానే నుల్చున్నాడు రాంబాబు !

"కూర్చొబ్బా ! " అన్నాడు కమలాకర్రావ్ రాంబాబు వంక చిరాగ్గా చూసి అయిదు నిముషాల తర్వాత !

"థ్యాంక్స్"! అంటూ కూర్చున్నాడు రాంబాబు.

కమలాకర్రావ్ తన కరకమలాల్లోకి ఫోన్ తీసుకుని, "ఈ యబ్బాయి దాకా సరేనబ్బా !!మిగిలిన వాళ్ళందర్నీ .

అప్లికేషన్లు సబ్ మిట్టు చేసి వెళ్తే వచ్చే నెల ఏ సంగతీ చెప్తామనీ చెప్పి పంపించెయ్" అన్నాడు బయట రిసెప్షనిస్టుతో.

"ఇవ్వాళ నుడీ కొంచెం బావుంది... నేనే ఆఖరనమాట... లేదంటే మళ్ళీ వేరే రావాల్సి వచ్చేది" అనుకున్నాడు రాంబాబు మనసులో !

కరకమలాల్లో నుంచి ఫోన్ పోయి బయొడేటా వచ్చింది. " బయోడేటానా ఇది... ? 'భయోడేటా' లా భయమేస్తోంది ! సింపుల్‌గా పావు ఠావులో రాస్కు రావద్దంటయ్యా... ? ఎందుకిన్ని కిలోల బరువు ఎదవ కర్సని ఎదవ కర్సు బేవర్సుగా... ?" అన్నాడు రావు.

"నో సర్... యస్ సర్... ! " అన్నాడు రాంబాబు కంగారుగా !

నిజానికి, అంతకు ముందొక ఇంటర్వ్యూలో సింపుల్ బయోడేటా ఇస్తే వాళ్ళు "ఏం బయొడేటా బాబూ ఇది ? నో డిటైల్స్ ఎటాల్. గెట్ ఏన్ ఎలా బరేటెడ్ వన్" అని త్రిప్పికొట్టారు. ఇప్పుడేమో ఇలా ! వెధవది ! ఎట్లా చావాలి ? - అనుకుంటూ బుర్ర గోక్కున్నాడు, రాంబాబు.



" అదుగో - అన్ని అవలక్షణాలే ! సలక్షణంగా ఇంటర్వ్యూ కొచ్చి అలా బుర్ర బరుక్కోవడమేంటయ్యా ? బ్యాడ మ్యానరిస్మ్" అన్నాడు క.రా.

చట్టుక్కున చెయ్యి దించి చేతులు కట్టుకున్నాడు రాంబాబు.

"అదిగో ! ఆ ధూర్త లక్షణమే పనికిరాదు. నిన్ను తగ.... ?? అంటూ నాలిక్కర్చుకున్నాడు క.రా. బీపీ కంట్రోల్ చేసుకుంటూ.

తప్పు చేసిన వాళ్ళా కట్టుకున్న చేతులు వదిలేసి 'టేబుల్ మీద పెట్టుకుని కూర్చున్నాడు రాంబాబు.

"తియ్ టేబుల్ మీద ! నేను గనక సరిపోయింది. రేపు ప్రొప్రయిటరు ముందిలా చేశావో ప్రయివేటు క్లాసు పీకుతాడు ! ఏం ? ఇంటర్వ్యూకి అప్రోచ్ అయ్యే ముందు ఎలా బాడీ మూవ్‌మెంట్స్ ఉంచాలో ఏ కాంపిటీషన్ సక్సెస్ లాంటి వాటిల్లో నైనా ఫాలో అవవా ?బాడీ లాంగ్వేజ్ తెలీదన్న మాట బొత్తిగా ..." అన్నాడు అఫెండింగ్ క.రా.

అసలు తనొచ్చింది "ఫీల్డు సూపర్ వైజర్' పోస్టుట అది. "మరి తన చెవుల్లో ఈ కమలాకర్రావ్ ఖమలాలేమిటో ఖర్మ " అనుకున్నాడు రాంబాబు.

పకపకా నవ్వు వినిపించింది. అటూ ఇటూ చూశాడు. ఎవరూ లేదు ! తనే బిగ్గరగా నవ్వాడు ! అంటే " 'ట్రైన్ ఆఫ్ థాట్" మధ్యలో తెగింది... అలాగన్నమాట ! ఇదేమిటి ? భవిష్యత్ కార్యక్రమం నిర్ణయిద్దామనుకుని ఇలా ఆర్మ్ ఛెయిర్‌లో కొస్తే ఈ గతజలసేతువు లేంటి నాన్సెన్స్... అనుకుంటూ కళ్ళద్దాలు గళ్ళలుంగీతో తుడిచి మళ్ళీ ఫెళ్ళున కళ్ళ మీద వేస్కున్నాడు రాంబాబు !

అద్దాల్లోంచి ఎదురుగా స్ట్రీట్ లాంపూ.. దాని వెనగ్గా షాంపూ తలతో కుర్రదాని నిషా భంగిమ కనిపించి భంగపడ్డాడు ! ఇది సమయం కాదని దాన్ని దృష్టి కోణంలోంచి తీసేశాడు. పైపెచ్చు శేఖర్ దృగ్గోచరమయ్యాడు. మళ్ళీ 'ట్రైన్ ఆఫ్‌థాట్ ' శురూ !

"చుహూడు బ్రదర్..."అంటూ ఎంటీఆర్ స్టైల్లో మొదలు పెట్టి " లైఫ్‌లో నువ్వేంటి? నువ్వేం కావాలనుకుంటున్నావ్?నీ ఆంబిషనేంటి? నీ 'గోల్' ఏంటి?అనేవి డిసైడ్ చేస్కోవాలి నువ్ రాణించాలంటే " అన్నాడు శేఖర్, శేఖర్ కపూర్ స్టయిల్లో రాంబాబు కళ్ళద్దాల్లోకి సూటిగా చూస్తూ !

రాంబాబుకు రగిలింది. ఇంకేం ? అందుకున్నాడు.

"ముయ్‌రా ? గోల్ లేదూ గోంగూర లేదు. ది సీన్ ఇండియా. కర్మభూమి ఇది. అదలా ఉంచు. నేను మిడిల్ క్లాస్. కాదు బిలో మిడిల్. నీ కాంపిటీషన్ సక్సెస్‌ఫూల్సూ - మాష్టార్సూ డైలాగులు చెప్పకు ! పత్రిక పెడ్తే నేను అలాంటివి కోకొల్లలు రాస్తాను. అవి ఎంతో సుందరంగా ఉంటాయ్ ! అవి నీకేం చెప్తాయి. బోల్డ్‌గా ఉండు - బీ బ్రేవ్ - వాక్ బ్రిస్క్ - గ్రూమ్ వెల్ - టై నీట్ - బీ పొలైటూ - వగైరాలు. ఎవ్వుడ్రా ఇవన్నీ ? దమ్మిడీలుంటేనే గద్రా దమ్ములొచ్చేది. ఒరేయ్ ఫూల్ ...'జాతిపిత' కావాలని 'గోల్' పెట్టుకుని గాంధీ కెరీర్ మొదలెట్టలా - ఆంధ్రావతరణ గోల్ పెట్టుకుని పొట్టి శ్రీరాములు పుట్టలేదు - ఇప్పుడున్న కాంప్లెక్స్ సొసైటీలో బిలో మిడిల్స్ గోల్స్ పెట్టుక్కూర్చుంటే పుట్టగతులుండటం లేదు. ఆ పూట కష్టంతో రొట్టెతో పొట్ట నింపుకుని కలెక్టరు గోల్ దిశగా వాడు అడుగేయలేడు ! 'కోటా' అంటావా ? అసలు అర్హుడి చేతుల్లో కాకుండా మరొహడి చేతుల్లో ఉంది ! నువ్ డాక్టర్ గానో ఆర్కిటెక్‌గానో గోల్ పెట్టుకుని పట్టు సాధించగలవా ఈ అనిశ్చిత వాతావరణంలో ? పంచవర్ష ప్రణాళిక కాదుగదా మాస - వార ప్రణాళికలు వేసుకోవడమే గగనమై పోయింది ప్రభుతకి ! అదే మన దీన ప్రజదీనూ! నువ్వు నువ్వు కావు నీ గోల్ నీది కాదు నీ ఆరాధ్యనటుడ్నే తీస్కో ! సబ్ రిజిస్ట్రార్‌గా వేయడం ఆయన గోల్ కాదు. కానీ చేశాడు ! వందలాది సినిమాల తర్వాత కూడా 'తెలుగుదేశం' కనీసం 'గోల్' కాదు. కాని జరిగింది 'భారతదేశం' గోలే ... కానీ జరగలేదు ! అందుకే డాక్టరు యాక్టరుగా, యాక్టరు ఎంపీగా, ఎంపీ ఎడిటర్‌గా, ఎడిటర్ వాణిజ్యవేత్తగా, వాణిజ్యవేత్త డైరెక్టరుగా, డైరెక్టరు నటుడిగా, నటుడు ఐఏయస్‌గా, ఐయ్యేయస్ కవిగా, కవి గాయకుడిగా, గాయకుడు చిత్రకారుడిగా, చిత్రకారుడు ఉగ్రవాదిగా, ఉగ్రవాది సైంటిస్ట్‌గా, సైంటిస్టు బాబాగా, బాబా మాఫియా లీడర్‌గా, మాఫియా లీడర్ మంత్రిగా ...ఇదంతా సైకిల్... అందరి గోల్ రెండే.. అదే ... ఒకటి... కోట్లకి పడగలెత్తడం... రెండు.. సర్వాధికార కాంతని చేపట్టడం... కాకపోతే ఆ పెట్టుకునే వాడ 'గోల్' స్థానంలో ' పెట్టుబడి' పెట్టుకునే వాడు నువ్ చెప్పిన విజయాలు సాధిస్తున్నాడు.... సారీ ... సంపాదిస్తున్నాడు..."

పకపకా నవ్వు వినిపించింది. అటూ ఇటూ చూశాడు. ఎవరూ లేదు ! తనే బిగ్గరగా నవ్వాడు ! అంటే " 'ట్రైన్ ఆఫ్ థాట్" మధ్యలో తెగింది... అలాగన్నమాట ! ఇదేమిటి ?

రాంబాబు అలా చెప్పుకుపోతుంటే ' హాచ్ఛ్ ! హాచ్ఛ్!!' అని బిగ్గరగా తుమ్మాడు శేఖర్ కపూర్ !

ఎవ్వుడైనా "ఇహచాలు మహాప్రభో"... అని చెప్పాలనిపించినపుడు అలా సింబాలిగ్గా కృత్రిమ తుమ్ములు చొప్పించి ఆపించడం శేఖర్ రివాజు.

" అయ్యా గురూ గారు ? ఇంతకీ లక్ష్యం లేని బతుకు బతకమని తమరి సెలవా?" పాయింటు కొచ్చేసినట్టు మాట్లాడాడు కొంటె నమస్కారం పెడుతూ శేఖర్ కపూర్.

" అలా ఎన్నటికీ అనను. లక్షాధికార్లకే లక్ష్యాలు కానీ భిక్షువులకూ తదితర సూక్ష్మ జీవులకూ లక్ష్యాలు మోక్షదాయకాలే గానీ భక్ష్య ప్రదాతలు గావని మా సారాంశం శిష్యా !" అన్నాడు అంతే కొంటెగా రాంబాబు.

ఎవరూ పకపకా నవ్వలేదు.

నవ్వడానికెవరున్నారు. ఇదంతా 'ట్రైన్ ఆఫ్ థోవ్' అదే 'ఆలోచనా మాలిక'లో భాగమాయె.ఆ విషయం నాలుగు చినుకులు ఒంటి మీదపడ్డప్పుడు కానీ తెలీలేదు రాంబాబుకు.

ఏ వానకా గొడుగు పట్టడానికి రాంబాబు దగ్గరది లేదు. ఆలోచించే బుర్రని మూతేసేశాడు. ఆర్మ్ ఛెయిర్ మడుతేసేశాడు. నాలుగంగల్లో మెట్ల కింద రూంలో కొచ్చి యధాప్రకారం వాలాడు.

నగటు జీవి మీద సర్కారు వారి పన్నుల్లా పడుతున్న చినుకులు మరింత పెద్దవైనై ! ఏంవిటో... !!

అంతరంగంలో అంతర్మధన జ్వాలాకీల ! నగరమంతా విస్తరిస్తున్న వర్షర్తు హేల ..!! ఎవరి దారి వారిది....